అవినాష్‌రెడ్డికి మద్దతుగా బైఠాయించిన నాయకులు

జగనన్న విద్యా దీవెన కింద రూ.23.60 కోట్లు విడుదల

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జనవరి 2023 నుండి మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని జిల్లా వ్యాప్తంగా అర్హులయిన 30,636 మంది విద్యార్థులకు సంబంధించిన 27,811 మంది తల్లుల ఖాతాల్లో రూ.23.60 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా జనవరి 2023 నుండి మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ప్రతాప్, సూర్యనారాయణ రెడ్డి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస కుమార్, మైనారిటీ సంక్షేమ అధికారి సభిహ పర్వీన్, బిసి సంక్షేమ అధికారులు తదితరులు వీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్య ద్వారానే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా పేద విద్యార్థులు వారికి నచ్చిన కోర్సుల్లో విద్యను అభ్యసించడమే కాక, వారికి ఎటువంటి ఆర్థిక కష్టాలు రాకుండా ప్రభుత్వమే వారి ఫీజును పూర్తి స్థాయిలో ఫీ రీయింబర్స్‌మెంట్ ద్వారా చెల్లిస్తుందన్నారు. ఇతర ప్రభుత్వ పథకాలైన జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, అమ్మఒడి తదితర పథకాలతో ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. విద్యతో మాత్రమే కుటుంబాల రూపు రేఖలు మారే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు విద్యను అభ్యసించి రాబోయే తరాలకు మార్గనిర్దేశంగా ఉండాలన్నారు. విద్యార్థులు అందరూ ఇలాంటి అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అదే విధంగా తల్లుల ఖాతాల్లో జమ అయిన నగదును పది రోజులలోపు కాలేజీ యాజమాన్యాలకు చెల్లించడంతో పాటు కాలేజీలలో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించాలని కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కర్నూలు జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద 30,636 మంది విద్యార్థులు, 27,811 మంది తల్లుల ఖాతాలలో రూ.23.60 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఇందులో ఎస్సీ సంక్షేమం ద్వారా 157 మంది విద్యార్థులకు రూ.27.8లక్షలు, ఎస్‌టి సంక్షేమం ద్వారా 710 మంది విద్యార్థులకు రూ.54.5లక్షలు, బీసీ సంక్షేమం ద్వారా 21,512 మంది విద్యార్థులకు రూ.15.89 కోట్లు, ఇబిసి సంక్షేమం ద్వారా 2153 విద్యార్థులకు రూ.2.57 కోట్లు, కాపు సంక్షేమం ద్వారా 789 మంది విద్యార్థులు రూ.73.7లక్షలు, మైనారిటీ సంక్షేమం ద్వారా 5184 మంది ముస్లిం విద్యార్థులు రూ.3.65 కోట్లు, క్రిస్టియన్ సంక్షేమం ద్వారా 131 మంది విద్యార్థులకు రూ.17లక్షలు లబ్ది పొందారన్నారు. జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద జనవరి 2023 నుండి మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించిన పూర్తి స్థాయి ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.23.60 కోట్ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ సృజన, డిప్యూటీ మేయర్ రేణుక

సిబిఐ మానవత్వంతో వ్యవహరించాలి

- ఎమ్మెల్యే, మేయర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎంపీ అవినాష్‌రెడ్డి తల్లి అనారోగ్య పరిస్థితులలో సిబిఐ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హఫీజ్ ఖాన్, మేయర్ రామయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి వద్ద బైఠాయించి అవినాష్ రెడ్డికి మద్దతు తెలిపారు. సిబిఐ విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయాన్ని ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీ స్వయంగా విచారణకు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షురాలు సిట్రి సత్యనారాయణమ్మ, సీనియర్ నాయకులు గడ్డం రామకృష్ణ, కార్పొరేటర్లు శ్రీనివాసరావు, పద్మలత రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉద్యోగం రాలేదని మనస్థాపం చెంది బొల్లవరం రాజేష్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని కర్నూలు మూడో పట్టణ సిఐ మురళీధర్ రెడ్డి బుధవారం పేర్కొన్నారు. బుధవారపేటకు చెందిన బొల్లవరం రాజేష్ కుమార్ తన చెల్లెలు దామినితో కలిసి బుధవార పేటలోని సుప్రియ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. ఈనెల 22న రాత్రి 9:30 గంటల సమయంలో సి.క్యాంప్ లోని చెల్లెలు ఉంటున్న ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. పరిస్థితిని గమనించిన చెల్లెలు దామిని, తన తమ్ముడు చార్లెస్ తో కలిసి రాజ్ కుమార్‌ను చికిత్స నిమిత్తం జిజిహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ 24వ తేదీ ఉదయం 7:30 గంటలకు రాజకుమార్ మృతి చెందినట్లు సిఐపేర్కొన్నారు. మృతుడు తనకు ఉద్యోగం రాలేదని, వివాహం కాలేదని జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తల్లి బొల్లవరం కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

30న పత్తికొండకు ముఖ్యమంత్రి

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి- పత్తికొండ

ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పత్తికొండకు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని ముఖ్యమంత్రి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సందర్భంగా సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో సభ ఏర్పాట్లు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో హెలిప్యాడ్ ఏర్పాటును పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. వారు వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్‌డిఒ మోహన్‌దాస్, తహశీల్దార్ విష్ణు ప్రసాద్, పత్తికొండ అర్బన్ సిఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటను సిసిఐ ద్వారా కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గత సంవత్సరం ఖరీఫ్‌లో పండిన పత్తి పంట ధర లేక రైతుల ఇళ్లలో నిల్వ ఉందని వెంటనే సిసిఐ ద్వారా ఒక క్వింటాలకు రూ.6800 ఇచ్చి కొనుగోలు చేసి కర్నూలు జిల్లా రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కల్లూరు మండలం పెంచికలపాడు గ్రామంలో దాదాపు 1000 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఒక లక్ష క్వింటాళ్లు నిలువ ఉండవచ్చని వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సిసిఐ ని రంగంలోకి దింపి క్వింటాలకు రూ.6800 ప్రకారం ధర నిర్ణయించి పత్తి రైతులను ఆదుకోవాలని రామకృష్ణ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. లక్షలాది ఎకరాల్లో పంటలు వేస్తే నకిలీ విత్తనాల వల్ల వాతావరణం వల్ల మంట దిగుబడి సక్రమంగా రాక రూ. లక్షలాది నష్టపోగా పండిన పంట కూడా ధర లేక అమ్ముకోలేక రైతులు మనోవేదనతో కుంగిపోతురన్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో రైతాంగం మరింత ఇబ్బందులకు గురి అవుతారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పత్తి రైతులకు ఇన్సూరెన్స్ రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితులలో జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గురుకులాల్లో ఆణిముత్యాలు

- పది, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు - ఉత్తీర్ణులు కాని వారికి ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆణిముత్యాలు తయారవుతున్నారు. ఆ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు నమోదవుతున్నాయి. ఉత్తీర్ణులు కాని వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు...

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలుగా పేరు మారిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు విద్యలో ఆణిముత్యాలను తయారు చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు పాఠశాలలు ఉండగా పదో తరగతి పరీక్షల్లో సరాసరిన 80.99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదోని గురుకుల పాఠశాలలో అత్యధికంగా 98.68 ఉత్తీర్ణత శాతం నమోదయింది. కంబాలపాడు పాఠశాలలో 86.84 శాతం, సి.బెళగల్‌లో 79.68, వెల్దుర్తిలో 77.50, పత్తికొండలో 77.33, అరికెరలో 75.67, దిన్నెదేవరపాడులో 71.05 ఉత్తీర్ణత శాతం నమోదయింది. నంద్యాల జిల్లాలో ఆరు పాఠశాలలు ఉండగా పదో తరగతి ఫలితాల్లో సరాసరిన 84.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా లక్ష్మాపురం గురుకుల పాఠశాల 96.20 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి పాఠశాలలో 88.46, కోవెలకుంట్లలో 87.34, డోన్‌లో 81.57, జూపాడుబంగ్లాలో 77.77, ఆళ్లగడ్డ రెగ్యులర్‌లో 73.75 శాతం ఉత్తీర్ణత నమోదయింది. పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం చిన్నటేకూరు, డోన్ పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో కర్నూలు జిల్లాలో ఐఐటి గురుకుల కళాశాల ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఆదోని కళాశాలలో బైపిసిలో 96.88 శాతం మంది, వెల్దుర్తి బైపిసిలో 94.29, చిన్నటేకూరు ఎంపిసిలో 93.62, చిన్నటేకూరు బైపిసిలో 92.16 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ కళాశాలలో బైపిసిలో 94.74, లక్ష్మాపురం బైపిసిలో 92.50, కోవెలకుంట్ల బైపిసిలో 91.43, కోవెలకుంట్ల ఎంపిసిలో 87.50 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

పదిలో ఉత్తమ మార్కులు సాధించిన

బి.రాణి	డోన్	573
జి.దేవిక	ఆదోని	568
కె.సోని	ఆళ్లగడ్డ రెగ్యులర్	563
బి.బాలగౌతమి	కోవెలకుంట్ల	562
ఎం.శైలజ	దిన్నెదేవరపాడు	562
ఆర్.అనిత	దిన్నెదేవరపాడు	562
బి.మౌనికబాయి	వెల్దుర్తి	549
సి.ప్రియాంక	ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి	546
ఎం.గుణప్రియ	ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి	546

ఇంటర్మీడియట్‌లో ఇలా..

పి.మనోజ్ కుమార్	కర్నూలు ఐఐటి	984
ఆర్.కిరణ్ కుమార్	కర్నూలు ఐఐటి	978
కె.తేజ్ కుమార్	చిన్నటేకూరు	974
ఎం.శ్యామల	ఆదోని	973
బి.పూజిత	పత్తికొండ	968
ఎం.అర్చన	డోన్	967
పి.సందీప్	చిన్నటేకూరు	960
యమున	ఆళ్లగడ్డ	959
ఎం.మణి	కంబాలపాడు	958

ప్రత్యేక శిక్షణ శిబిరాలు...

పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. చిన్నటేకూరు, డోన్ పాఠశాలల్లో ఈ శిబిరాలు నడుస్తున్నాం. విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడమే మా లక్ష్యం. పాఠశాలలు, కళాశాలలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాము.

- డాక్టర్ ఐ.శ్రీదేవి, ఎపిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్ జిల్లా కో ఆర్డినేటర్.

వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

వృద్ధులు జీవిత మార్గ నిర్దేశకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నేటి యువతరం జీవిత అనుభవం తెలుసుకోవాలంటే వృద్ధులతో గడపాలనిచ వృద్ధాప్యం మరో పసితనం లాంటిదని, వద్దులే జీవిత మార్గదర్శకులు అన్న సత్యాన్ని ప్రతి ఒక్కరు గ్రహించి వారి పట్ల ప్రేమ ఆప్యాయతలు చూపాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ప్రముఖ సీనియర్ వైద్యులు శంకర్ శర్మ సూచించారు. బుధవారం కర్నూలు మండలం దీన్నే దేవరపాడు గ్రామ పరిధిలోని కృప వృద్ధాశ్రమంలోని వద్దులకు నిత్యవసర సరుకులను అందజేశారు. సీనియర్ వైద్యులు శంకర్‌శర్మ మాట్లాడుతూ వృద్ధులకు ఆత్మీయుల కోసం ఎంతగానో ఎదురు చూపులు చూసే మనసు ఉంటుందని అన్నారు. ప్రేమ ఆప్యాయతలు లేని సంసారాల వల్ల ఉద్యోగాల పేరిట దూరం అవుతున్న కొడుకు కోడళ్ల వలన గృహ సంబంధమైన వివాదాల వల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు పిల్లలకు దూరంగా ఉండేందుకు వృద్ధాశ్రమాల్లో చేరి ఏకాకులగా ఉంటున్నారని అన్నారు. కారణం ఏదైనా ఫలితం మాత్రం తల్లిదండ్రుల మీదే పడుతుందన్నారు. జీవిత అనుభవం తెలుసుకోవాలంటే నేటి యువతరం వృద్ధులతో గడపాలని, అప్పుడే యువతకు సీనియర్ సిటిజన్లు మార్గ నిర్దేశకులని తెలుస్తుందన్నారు.

సచివాలయ సారధులు వాలంటీర్లు

ప్రజాశక్తి-తుగ్గలి :

గ్రామాలలో ఉన్న సచివాలయంలో పనిచేసే వాలంటీర్లు సచివాలయ సారాదులుగా నడుస్తున్నారని సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు అన్నారు. బుధవారం మండలం పరిధిలోని శాభాశపురం గ్రామంలో సచివాలయంలో పనిచేస్తున్న వాలంటీర్లకు సేవా పథకాలను అందించి వారిని ఘనంగా సన్మానించారు. అదే విధంగా పెండేకల్లులో సొసైటీ చైర్మన్ అట్లా గోపాల్ రెడ్డి, ఎద్దులదొడ్డిలో మల్లికార్జునరెడ్డి వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. సచివాలయం మండల కన్వీనర్ హనుమంతు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గత నాలుగేళ్ల పాలనలో సచివాలయం వాలింటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించిన ఘనత వారికే దక్కిందన్నారు. సర్పంచి పుష్పవతి, గౌరవ సలహాదారు గూటిపల్లి రవి, గోపాల్, అట్లా బసిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంకాలప్ప, రాముడు, కార్తీక్, వైసిపి నాయకులు ,వాలంటీర్లు పాల్గొన్నారు.

కార్మికులు,కర్షకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ఇఎస్‌ఐ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని 26న నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు కర్షకులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు పి.నిర్మల కోరారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు కర్నూల్ న్యూ సిటీ ఆఫీస్ బేరర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పిఎస్. రాధాకృష్ణ, పి.నిర్మల, నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని పక్కన పెట్టి, కార్మిక వ్యతిరేక చట్టాలను చేస్తూ, బడా కంపెనీలైన అదాని, అంబానీలకు అనుకూలమైన చట్టాలను చేస్తూ కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. కార్మికులకు ఆసుపత్రి, మందులు, పెన్షన్లు, సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి, తదితర సౌకర్యాలు కల్పించే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఇఎస్‌ఐ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. దేశమంతటా ఇఎస్‌ఐ పథకాన్ని 2022 కల్లా విస్తరించాలని, నిర్ణయం తీసుకున్నప్పటికీ అది ఎక్కడ కనపడని పరిస్థితి నెలకొందన్నారు. ఇఎస్‌ఐ ఆసుపత్రులు, డాక్టర్లు, పరికరాలు, సిబ్బంది, మందులలేమితో కునారిల్లుతున్నాయన్నారు. కార్మికుల డబ్బులు రూ.లక్ష పదివేల కోట్ల రిజర్వు నిధులుగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన విధంగా స్కీమును బలోపేతంచేయడానికి సిద్ధపడకుండా ఇఎస్‌ఐ పథకాన్ని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఇఎస్‌ఐ పథకాన్ని బలోపేతం చేయాలని, కర్నూలు ఇఎస్‌ఐ హాస్పిటల్‌ను కేంద్ర ఇఎస్‌ఐ ఆజమాయిషికి పంపవద్దని కోరుతూ ఈనెల 26న కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నాను చేపట్టాలని నిర్ణయించామన్నారు. జూన్ 16న ప్రపంచ రక్త దాన దినోత్సవం పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో వందమంది కార్మికుల చేతరక్తదానంచేయించాలని, పర్స సత్యనారాయణ జయంతినిపురస్కరించుకొని జూన్ 2 నుండి 2023 నుండి2024 వరకు సెమినార్లు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. మే నెల అంతా కార్మికులను చైతన్యం చేయాలని, మున్సిపల్ కార్మికుల సమస్యల పైన మే 31 నుండి జూన్ 9వ వరకు జరిగే జాతాను విజయవంతం చేయాలని, పీఎఫ్ సమస్యల మీద ప్రతినెల 10న అధికారులు నిర్వహించే అదాలత్‌ను ఉపయోగించి డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీలను ఆర్టిఐను ఉపయోగించి సమస్యలను పరిష్కరించాలన్నారు. 2023 సభ్యత్వాలను జులై నెలాఖరి నుండి ప్రారంభించాలని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించారు. సమావేశంలో సిఐటియు ఆఫీస్ బేరర్స్ టి.రాముడు, జి.ఏసు, ఎం. వెంకటేశ్వర్లు ఎస్.రఫీ, ఎస్.వలి, ఎం. గోపాల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పి.నిర్మల

వెంచర్ ప్రహరీ కూల్చివేత

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పరిధిలోని ఓ వెంచర్లో నిర్మించిన ప్రహరీ గోడను గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని ఫ్లాట్ బాధితులు కోరుతున్నారు. ఈ వెంచర్‌లో 2016లో ఎల్‌పి నెంబర్ రిజిస్ట్రేషన్ అయిందని ఆపై రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా తమ పేరున సదరు ప్లాట్లు రిజిస్టర్ అయ్యాఅన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వెంచర్ చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడను కూల్చివేశారని, సదరు వ్యక్తులను గుర్తించి తమకు న్యాయం చేయాలని బాధితులు రాజశేఖర్, నరసింహులు, ఖాజారావు, రవికుమార్, ప్రసాద్, శ్రీనివాస నాయుడు, మదన గోపాల్ తో పాటు మరికొంతమంది బాధితులు ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఎస్‌ఐ స్పందించలేదని బాధితులు వాపోయారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

కర్నూలు బిక్యాంపు క్రీడామైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 40 మంది క్రీడాకారులకు బుధవారం సీనియర్ క్రీడాకారుడు వెంకటరామిరెడ్డి క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఒలంపిక్ సంఘం సిఇఒ విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు నిత్యం సాధన చేయడం ద్వారా మానసిక, శారీరక ఎదుగుదల ఉంటుందన్నారు. వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు ఇచ్చిన దుస్తులు వారిలో ఆటపై ఎంతో ప్రేరణ కలుగుతుందన్నారు. ఎస్‌కెయు యూనివర్సిటీ క్రికెటర్ చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు నిత్యం ఆటలో సాధన చేయడం వల్ల టివి, సెల్‌ఫోన్ల నుంచి దూరం చేయ వచ్చన్నారు. పెద్దపాడు హెచ్‌ఎం.వేణుగోపాల్, రంగడు, సీని యర్ క్రీడాకారులు విజయ్, రాజేశ్వర్, నరసింహులు, పాల్ విజయకుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ. హఫీజ్‌ఖాన్

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ రాయల్ ఫంక్షన్ హాలులో హజ్ కమిటీ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న వాక్సినేషన్, ట్రైనింగ్ క్యాంపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై హజ్ యాత్ర తొలిసారి విజయవాడ ఎయిర్ పోర్టు నుండి నేరుగా విమాన సదుపాయం ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేసేమన్నారు. తద్వారా ఇకపై హజ్ యాత్రకు ప్రత్యేక ఎయిర్ లైన్స్ సౌకర్యం వచ్చిందన్నారు. 1,813 మంది హజ్ యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.80,000ల చొప్పున రూ.14.51 కోట్ల ఆర్థిక సాయం చేసిన మన ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రహజ్ కమిటీ డైరెక్టర్ మంజూర్ మౌలానా, తాటిపాడు మభూసా , మూఫతి అబ్దుల్ రెహ్మాన్, అబ్దుల్లా హాఫిసాబ్ ,అబ్దుల్ సలాం, జిల్లా వాకఫ్ బోర్డ్ సెక్రటరీ దాదాబాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తీర్చే బాధ్యత నాది : టిజిభరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమస్యలు తెలుసుకుంటున్న టిజి.భరత్

కర్నూలు నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి టిజి.భరత్ అన్నారు. కర్నూలు 43వ వార్డులో ఆయన వార్డు పర్యటన చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారితో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు టిజి. భరత్ తో సమస్యలు మొరపెట్టుకున్నారు. రోడ్లు సరిగా లేవని, డ్రైనేజీలు క్లీన్ చేయడం లేదని, పెన్షన్లు అందడం లేదని, ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఉద్యోగాలు లేవని చెప్పారు. టిజి.భరత్ మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోవడం చాలా దారుణం అన్నారు. ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజల బాధలు అర్థం చేసుకోవాలన్నారు. లేదంటే ప్రజలే తీర్పు చెబుతారన్నారు. తాను ఎమ్మెల్యే అయిన వెంటనే కర్నూలు ప్రజల సమస్యలు తీరుస్తానన్నారు. అన్ని వార్డుల్లో పింఛన్ల సమస్యలు ఉన్నాయని వీటిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి తెలియజేస్తామని భరత్ చెప్పారు. వార్డు ఇంచార్జి రాజశేఖర్, నేతలు యేసు, చంద్ర, హనుమంత రావు చౌదరి, నాగేశ్వరరావు, నారాయణ చౌదరి, వెంకటేష్, రాము, అశోక్, భాస్కర్, నరేష్, రవి, వినోద్ చౌదరి, శ్రీధర్, బాలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వసతుల పరిశీలన

ప్రజాశక్తి - చిప్పగిరి

వసతులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి వేణుగోపాల్

చిప్పగిరి జగనన్న కాలనీలో థర్డ్ పార్టీకి చెందిన కాంట్రాక్టుదారులు గృహాలను నిర్మిస్తున్న నేపథ్యంలో బుధవారం కాలనీలోని నీటి వసతులను మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వేణుగోపాల్, మండల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడారు. గృహ నిర్మాణాలు వేగవంతమయ్యేందుకు సంబంధిత లబ్ధిదారులతో మాట్లాడాలన్నారు. ఐదేళ్ల నుంచి 18 ఏళ్ల వరకు ఉన్న పిల్లల సర్వేను త్వరగా పూర్తి చేసేలా గ్రామ వాలంటీర్లకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సుధాకర్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్ నీలా, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, పంచాయతీ కార్యదర్శి బాలన్న, హౌసింగ్ భవ్య, ప్రభుత్వ డాక్టర్ జమీల్ అహ్మద్, థర్డ్ పార్టీకి చెందిన కాంటాక్టుదారులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

- టిడిపి ఫ్లోర్ లీడర్ దయాసాగర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు

పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని టిడిపి ఫ్లోర్ లీడర్ వి.దయాసాగర్ డిమాండ్ చేశారు. బుధవారం దయాసాగర్ నాయకత్వంలో టిడిపి నాయకులు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ గుంతలు పడిన రోడ్డుపై నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుంతలు పడి, కంకర తేలిన రోడ్డుపై ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలో రోడ్లు వేయలంటూ, టిడిపికి ఓట్లు వేసినందుకు వార్డు ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. గుంతలమయంగా ఉన్న ఎల్‌ఐసి కార్యాలయం రోడ్డుతో పాటు ఎఆర్ స్పోర్ట్స్ దుకాణం నుంచి పిరమిడ్ ధ్యాన కేంద్రం వరకు రోడ్డు వేయాలని రెండేళ్లుగా కౌన్సిల్‌లో కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డుకు కోసుకుపోయి, గుంతలు పడి, కంకర తేలిందన్నారు. ఈ దారిలో పలు బహుళ అంతస్తుల భవనాలు, పలు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయన్నారు. స్థానికులు, ప్రయాణికుల నుంచి రోడ్డు బాగు చేయాలని డిమాండ్ వ్యక్తం అవుతోందని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు. లేకపోతే వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. టిడిపి నాయకులు మల్లికార్జున, మధుబాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

నిజమైన ఆయకట్టుదారులకు లబ్ధి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో తుంగభద్ర జలాశయం కింద ఉన్న నిజమైన ఆయకట్టుదారులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపడతామని తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ జెఇ తిమ్మారెడ్డి ఆయకట్టు రైతులకు తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయకట్టు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిజమైన ఆయకట్టు రైతులు ప్రతేడాది సంబంధిత శాఖకు చలానా కట్టి రసీదు పొందితే వారి మనగడకు ఏ ఢోకా ఉండదని తెలిపారు. అక్రమంగా సాగునీటిని వాడుకొని నిజమైన ఆయకట్టు రైతులకు నష్టం చేకూర్చే వారి అక్రమ కనెక్షన్లను తొలగించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల్లో అనాదిగా సాగునీటి కింద పంటలు పండించుకునే ఆయకట్టు రైతులకు ప్రతేడాది అక్రమ కనెక్షన్లు తీసుకున్న వారితో గొడవలు జరుగుతూనే ఉన్నాయన్నారు. అలా జరగకుండా అక్రమ కనెక్షన్లు తొలగించేలా చర్యలు తీసుకుంటామని, అందుకు ఆయకట్ట రైతులందరూ సహకరించాలని కోరారు. రెవెన్యూ కార్యదర్శులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ అధికారులు

శ్మశాన స్థల సమస్యను పరిష్కరించాలి

- లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటారు

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

ప్రజాశక్తి - గోనెగండ్ల

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి

గోనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామంలో గత రెండు నెలలుగా మూలుగుతున్న శ్మశాన సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలే శ్మశాన భూమికి కావాల్సిన స్థలాన్ని స్వాధీనం చేసుకుంటారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి హెచ్చరించారు. బుధవారం గౌస్‌దేశాయి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు చిన్న రోషన్న, సిపిఎం జిల్లా నాయకులు హనుమంతుతో కలిసి బి.అగ్రహారం గ్రామంలో పర్యటించారు. మనిషి చనిపోయి శ్మశాన స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడిన మాల రాజశేఖర్, బోయ మారెమ్మ, చాకలి ఆదెమ్మ కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. భూస్వామి కబ్జా చేసుకుని, అక్రమ పట్టా ద్వారా, రస్తా పేరుతో కోర్టుకెళ్లి స్టే తెచ్చుకున్న సర్వే నెంబరు 244లో 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. బి.అగ్రహారం గ్రామంలోని బ్రహ్మంగారి దేవాలయం వద్ద కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభనుద్దేశించి గౌస్‌దేశాయి, రామాంజనేయులు, ఆనంద్ బాబు మాట్లాడారు. ఏ గ్రామంలోనైనా శ్మశానానికి ప్రభుత్వ భూమి లేకపోతే ప్రయివేట్ స్థలాన్నైనా కొని ఇవ్వాల్సిన బాధ్యత అధికారులదని తెలిపారు. బి.అగ్రహారం గ్రామంలో ప్రభుత్వ భూమి ఉన్నా దానిని భూస్వామికి ధారాదత్తం చేసి, తిరిగి శ్మశానం కోసం ప్రజలకు భూమి ఇవ్వడానికి దేవులాడాల్సిన పరిస్థితి దాపురించిందని చెప్పారు. అక్రమ పట్టా చేయించిన అధికారులను డిస్మిస్ చేయాల్సి ఉండగా ఇప్పటిదాకా సస్పెండ్ కూడా చేయలేదన్నారు. అక్రమ పట్టా చేయించుకున్న వ్యక్తిపై ఎందుకు క్రిమినల్ కేసు పెట్టకూడదని ప్రశ్నించారు. అధికారులు, భూస్వాముల లాలూచీతత్వానికి మధ్యన ప్రజలు బలవుతున్నారన్నారు. భారతదేశ తొలి ప్రతిపక్ష నాయకునిగా పని చేసిన పుచ్చలపల్లి సుందరయ్య, పత్తికొండ ఎమ్మెల్యేగా పని చేసిన ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి లాంటి వారు, వారికున్న భూమినంతా పేదలకు పంచి, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. అలాంటివారు మనకు ఆదర్శమన్నారు. గ్రామం మొత్తంగా మృతి చెందిన ప్రతిసారీ శ్మశాన స్థలం కోసం ఆందోళన చేస్తుంటే ఇక్కడ ఉన్న ప్రజాప్రతినిధులకు చీమకుట్టినట్లుగా కూడా లేదని మండిపడ్డారు. ఈ పాలక పక్షాలు దళిత, బహుజనల వైపు ఉంటారో లేదా అధిపత్య భూస్వాముల వైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని గ్రామస్తులే శ్మశానంలో జెండాలు పాతి స్వాధీనం చేసుకుంటారని హెచ్చరించారు. గ్రామ పెద్దలు గోవిందు, హనుమంతు, రాఘవేంద్ర, నరసింహుడు, గిరి రాజు, రామాంజిని, వెంకన్న, మహాలింగ, యాకాశి అంజినయ్య, మురళీ, రంగస్వామి, మౌలాలి, తిమ్మప్ప, వెంకటేష్, రంగమ్మ, నారాయణమ్మ, పెద్ద రంగమ్మ, మౌలాలమ్మ పాల్గొన్నారు.

అధికారుల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం మండల స్థాయి అధికారుల పనితీరుపై మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ గౌరీ దేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడారు. ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్య ధోరణి వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి తమ సేవలను అందించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఇఒఆర్‌డి సూర్యనారాయణ, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, హౌసింగ్ ఇంజినీర్ అనిరుధ్, పంచాయతీ ఇన్‌ఛార్జీ అధికారి ఉదయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుమిత్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసులు

సంక్షేమ సేవకులు వాలంటీర్లు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

- వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వాలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారు సంక్షేమ సేవకులుగా మన్ననలు పొందుతున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎంపిపి దానమ్మ అధ్యక్షతన, ఎంపిడిఒ గీతావాణి ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వాలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మంచి పేరు తెచ్చేలా వాలంటీర్లు పని చేస్తున్నారని, ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్రలుగా వారిని సత్కరించడం, నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వాలంటీర్లకు నిజమైన వందనాలని అన్నారు. ఇప్పుడు పురస్కారం పొందలేని వాలంటీర్లు పోటీ పడి ఉత్తమ సేవలు అందించి వచ్చే సంవత్సరం పురస్కారం అందుకునేలా కృషి చేయాలని తెలిపారు. మండలం మొత్తం 35 సచివాలయాలకు గాను సేవా మిత్రలుగా 436 మంంది, సేవా రత్నాలుగా 5గురు, సేవా వజ్రలుగా ఇద్దరికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసి సన్మానించారు. సర్పంచులు ప్రహ్లాద యాదవ్, నారాయణ, రాము, రామాంజనేయులు, రాంకోటే రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎంఇఒ శివరాములు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగమల్లయ్య, పంచాయతీరాజ్ ఎఇ మాలిక్, ఇఒఆర్‌డి నాగరాజ్, వైసిపి సీనియర్ నాయకులు నరసింహమూర్తి, గురునాథ్ రెడ్డి, మండగిరి శేషిరెడ్డి, వీరేష్, మెడికల్ నాగరాజు, గర్జప్ప పాల్గొన్నారు. **కౌతాళం** ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లను సన్మానించారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాట్లాడుతూ... నిస్వార్థ సేవకులుగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలనలో పాలు పంచుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. సింగిల్‌విండో అధ్యక్షులు దాట్ల కృష్ణంరాజు, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సర్పంచి పాల్ దినకరన్, నాయకులు అవతారం, వడ్డే రాముడు, అబ్దుల్ సమద్, పాండురంగారెడ్డి, సోమిరెడ్డి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ శేఖర్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్ రాజు, పంచాయతీ కార్యదర్శి బాలన్న ఆధ్వర్యంలో వాలంటర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా మిత్ర, సేవా రత్న, సేవావజ్ర పతకాలను ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, సొసైటీ ఛైర్మన్ మల్లికార్జున, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ చేతులమీదుగా వాలంటీర్లకు అందజేశారు. ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న పాల్గొన్నారు.

ఆదోనిలో వాలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు

కౌతాళంలో వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

చిప్పగిరిలో పురస్కారాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడేసిన దుండగులు

ఇంటికి తాళం వేశారంటే కన్నం పడినట్లే..!

- శ్రీనగర్ కాలనీలో రెండు ఇళ్లలో చొరబడ్డ దొంగలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో ఇంటికి తాళం వేశారంటే మీ ఇంటికి దొంగలు కన్నం వేసినట్లేనని పలువురు చర్చించుకుంటున్నారు. పట్టణంలోని గుడికల్ రోడ్డులో ఉన్న మునెప్ప నగర్, రాధాకృష్ణ కాలనీకి ఆనుకుని ఉన్న శ్రీనగర్ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో దొంగతనాలకు ప్రయత్నం చేశారు. శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు ప్రసాద్, బావిగడ్డ నల్లారెడ్డి ఇళ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి ప్రయత్నం చేశారు. ఇద్దరూ ఉపాధ్యాయులు ఊరికి వెళ్లడంతో రాత్రి ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న వీధి కుక్కలు మొరగకుండా మత్తుమందు కలిపిన బిస్కెట్లను వేసినట్లు అక్కడి వారు తెలిపారు. రెండు మెయిన్ డోర్ల సిలుకలను పగులగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని వస్తువులను చిందరవందరగా పడేశారు. అలాగే ఇతర రూములో కూడా సోదా చేశారు. నగదు, బంగారు దొరకకపోవడంతో దొంగలు జారుకున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు రషీద్

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు ఎస్ఎ.రషీద్ విమర్శించారు. బుధవారం ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ఉద్యోగుల సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 1న జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ఉందని, దానికి ప్రత్యేకమైన చట్టం రూపొందించాలని కోరారు. అధికారంలో రాకముందు వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరిస్తామని ఉద్యోగులకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. న్యాయమైన హామీ ఇచ్చి నాలుగేళ్లు గడిచినా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన డిఎ, అరియర్స్ బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 22 నుంచి తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన ప్రక్రియ మొదలైందన్నారు. కార్యాచరణలో భాగంగానే జూన్ 1న పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లో రిలే దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగులంతా భారీగా తరలిరావాలని కోరారు. 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు జాయింట్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి రవి, కార్యవర్గం రాధాకృష్ణ, నబీ రసూల్, లక్ష్మి, చెన్నయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న సంఘం తాలూకా అధ్యక్షులు రషీద్

వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచి హైమావతి

వాటర్ వర్క్స్‌కు విద్యుత్ కోతలను మినహాయించాలి

- సర్పంచి హైమావతి

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మేజర్ పంచాయతీ ఎస్ఎస్ ట్యాంకు వాటర్ వర్క్స్‌కు విద్యుత్ కోతలను మినహాయించి, నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయాలని సర్పంచి హైమావతి కోరారు. బుధవారం గోనెగండ్ల విద్యుత్ కార్యాలయం వద్ద అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ సుధాకర్ బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో ఈ మధ్యకాలంలో ఎల్ఆర్ పేరుతో విద్యుత్ కోతలు అధికమయ్యాయని తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యుత్ కోత వల్ల గ్రామానికి నీరందించే ఎస్-ఎస్ ట్యాంకు మోటార్లు పనిచేయకపోతే గ్రామంలో ప్రజలకు తాగునీటిని అందించలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. విద్యుత్ అధికారులు స్పందించి 'లోడ్ రిలీఫ్' పేరుతో విధించే విద్యుత్ కోతల నుంచి ఎస్ఎస్ ట్యాంకు మోటార్లను మినహాయించి నిరంతరం విద్యుత్ అందజేసి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అడ్వకేట్ పూజారి చంద్ర, వెంకటేశ్వర్లు, బాబు నాయుడు, మెకానిక్ మలాంగ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ గీతావాణి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలోని ఎంపిడిఒ సమావేశపు భవనంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపిపి బడాయి దానమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ గీతావాణి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరు కావాలన్నారు. మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, జడ్‌పిటిసి, కోఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నకిలీకి బ్రేక్ పడేనా..?

- ప్రతేడాది కోట్లాది రూపాయల నకిలీ పత్తి విత్తనాలు సరఫరా

-ఆదోని డివిజన్ కేంద్రంగా నకిలీ పత్తి విత్తనాలు సరఫరా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

అసలు ప్యాకింగ్‌లో ఏ మాత్రం తేడా కనిపించదు. లోతుగా పరిశీలిస్తే తప్ప అది నకిలీ ప్యాకింగ్‌గా గుర్తించలేం. వర్షాకాలం సీజన్ ప్రారంభం కంటే ముందే నకిలీ పత్తి విత్తనాల తయారీకి శ్రీకారం చుడతారు. ఏ మాత్రం తేడా లేకుండా రంగురంగుల బొమ్మలతో ప్యాకింగ్‌లు తయారు చేస్తారు. ఈ విత్తనాల ద్వారా మంచి దిగుబడి వస్తుందని రైతులను బాగా నమ్మిస్తారు. ఎవరు చెప్పినా గుడ్డిగా నమ్మే రైతులు రంగురంగుల ప్యాకింగ్‌లు చూసి మోసపోతున్నారు. వాటిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. తర్వాత అవి నకిలీ విత్తనాలనే విషయాన్ని గ్రహిస్తున్నారు.

ప్రతేడాది ప్రభుత్వం నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నా పూర్తి స్థాయిలో మాత్రం బ్రేక్ పడడం లేదు. ప్రతేడాది కోట్లాది రూపాయల విలువైన నకిలీ పత్తి విత్తనాలు మార్కెట్‌లోకి రావడం, రైతులు కొనుగోలు చేయడం, మోసపోవడం పరిపాటిగా మారింది. మరో పది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానుంది. అప్పుడే నకిలీ విత్తనాలను సరఫరా చేసేందుకు దళారులు సిద్ధమవుతున్నారు. టాస్క్ ఫోర్స్ టీంతోపాటు పోలీసు, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేసి నకిలీ విత్తనాలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం సిద్ధం చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. నల్ల, ఎర్ర నేలలతో విస్తరించి ఉండడంతో స్వల్ప, దీర్ఘకాలికమైన పంటల సాగుకు అనువుగా ఉంది. సహజంగా పత్తి 180 రోజుల పంట. ఎర్రనేలల్లో 140 రోజుల వ్యవధిలోనే పంట చేతికొస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కొంతమంది వ్యాపారులు ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. నకిలీ విత్తనాలను కమీషన్ ఏజెంట్ల ద్వారా రైతులకు పంపిణీ చేసే ప్రయత్నం కొనసాగుతున్నట్లు సమాచారం. రూ.500 నుంచి రూ.600 వరకు లభించే 450 గ్రాములు కలిగిన విత్తన ప్యాకెట్‌ను (అప్పు కింద) రూ.800లకు అంటగట్టే దందా సాగుతోంది. పత్తి చేతికొచ్చిన తర్వాత రూ.100కు రూ.25 వడ్డీతో సహా చెల్లించాలనేది ఇందులో ప్రధాన ఒప్పందం. ఆదోని ఏజెన్సీల్లో రైతుల అమాయకత్వం వ్యాపారులకు ఆదాయ వనరుగా మారింది.

గ్రామాల్లో లూజు పత్తి విత్తనాల వ్యాపారం

వివిధ గ్రామాల్లో లూజు పత్తి విత్తనాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. లూజు పత్తి విత్తనాలు రూ.800 ప్రకారం తీసుకొని రైతులు మోసపోతున్నారు. ఎలాంటి ప్యాకింగ్ లేకుండా లూజు పత్తి విత్తనాల వ్యాపారం పలుకుబడి ఉన్నా పెద్ద రైతుతో కొనసాగిస్తున్నారు. చివరకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులకు ఆత్మహత్యలు తప్పడం లేదు.

పత్తా లేని టాస్క్‌ఫోర్స్

పంటల సాగు విధానంలో వ్యవసాయ శాఖది అత్యంత కీలకమైన పాత్ర. దుకాణాలకు అనుమతులివ్వడం, సరుకుల వివరాలను బోర్డులపై ప్రదర్శించడం, రసీదులు ఇవ్వడం, విత్తనాలను తయారు చేసిన కంపెనీల వివరాలతో పాటు వాటి వాడకానికి ఉన్న గడువు, విత్తనాలు వేస్తే వచ్చే మొలక శాతంలాంటి కీలకమైన అంశాలన్నింటినీ పరిశీలించాల్సింది వ్యవసాయ శాఖనే. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన వ్యవసాయ శాఖ కనీసం మండల, డివిజన్, జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటు ప్రాధాన్యత గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ప్యాకింగ్‌ల అడ్డా.. ఆదోని డివిజన్ కేంద్రం

ఆదోని ప్రాంతం మీదుగా నకిలీ విత్తనాల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నకిలీ విత్తనాలు ప్యాకింగ్ చేయడంలో ఆదోని కేంద్రంగా మారింది. నకిలీ విత్తనాలను అసలు విత్తనాలుగా ప్యాకింగ్ చేయడంలో వారికి వారే సాటి. ముందుగానే ప్యాకింగ్ చేసి పెట్టుకోవడంతో తనిఖీల్లో కూడా బయటపడని పరిస్థితులు నెలకొన్నాయి. పట్టుబడితే ఏదో ఒక పైరవీ చేసి బయటకు రావచ్చనే ధీమాతో నకిలీ విత్తనాలను తెస్తున్నట్లు సమాచారం.

పత్తి విత్తనాలు కొని మోసపోవద్దు

రైతులు కొనుగోలు చేసిన పత్తి విత్తనాల్లో ఎలాంటి అనుమానాలున్నా పట్టణంలోని మార్కెట్ యార్డులోని డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

లూజు పత్తి విత్తనాలపై సమాచారం అందించండి

- ఎఒ పాపిరెడ్డి

గ్రామాల్లో ఎవరైనా లూజు పత్తి విత్తనాలు కానీ, నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతుంటే మాకు సమాచారం అందించాలి. అలాంటి వారి పేర్లను గొప్పగా ఉంచుతాం. సెల్ నెంబర్ ఎడిఎ గిరీష్ 83310 57500, ఎఒ పాపిరెడ్డి 83310 57502 నెంబర్లకు సంప్రదించాలి.

ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫీ ఒక దిక్సూచి

- లియాఫీ సెంట్రల్ జోన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి

- ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఏజెంట్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి లియాఫీ ఒక దిక్సూచిలా పని చేస్తోందని లియాఫీ సెంట్రల్ జోన్ అధ్యక్షులు జంపాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మిగనూరు ఎల్ఐసి బ్రాంచి ఏజెంట్ల సమావేశం బ్రాంచి అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కృష్ణారెడ్డి, కడప డివిజన్ లియాఫీ అధ్యక్షులు జై భారత్ రెడ్డి హాజరయి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని, ఏజెంట్ల గ్రూపు ఇన్స్యూరెన్స్ రూ.20 లక్షలకు పెంచాలని కోరారు. కుటుంబం మొత్తానికి మెడికల్ క్లెయిమ్ వర్తింపజేయాలని, గ్రూపు ఇన్స్యూరెన్స్ 80 ఏళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రతిష్టను పెంచడంలో ఎమ్మిగనూరు బ్రాంచి ముందు ఉంటుందన్నారు. ఎమ్మిగనూరు బ్రాంచిలో పనిచేస్తున్న ఎల్ఐసి ఏజెంట్లు ఎస్.అక్బర్, ఎం.జిక్రియా, కె.వెంకటేశ్వర్ రెడ్డి, ఎ.శ్రీనివాసులు 98 డీఎస్సీ నియామకాల్లో ఎంపిక కావడంతో ముఖ్య అతిథులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు సన్మానించారు. అలాగే ఈ మధ్య సిఎం క్లబ్ మెంబర్‌కు శాశ్వతంగా ఎన్నికైన రాజగోపాల్ శెట్టిని సన్మానించారు. జోనల్ డివిజన్ బ్రాంచి నాయకులు రమేష్, కృష్ణ, ఆంధ్రయ్య, అనంతభారతి, ప్రభాకర్ రెడ్డి, హరినాథ్, జయరాం, శివరాం, సోమన్న, సుధాకర్, విశ్వనాథ్, రంగస్వామి, నరసింహులు, వేణుగోపాల్,

ఉపాధ్యాయులుగా ఎంపికైన ఏజెంట్లను సన్మానిస్తున్న సభ్యులు

టిబి వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నుంచి భీమాస్ సర్కిల్ వరకు టిబి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నేషనల్ నర్సింగ్ స్కూలు, నోబుల్ ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ప్లకార్డులు ధరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం టిబి వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఒటిసి డాక్టర్ షేకూన్ భాను, ఎంపిహెచ్ఎస్ బాబు రాజు మాట్లాడారు. రెండు వారాలపాటు దగ్గు ఉంటే టిబిగా అనుమానించాలన్నారు. టిబి ఉన్న వ్యక్తికి ఉదయం, సాయంత్రం జ్వరం వస్తూ ఉంటుందన్నారు. నేషనల్ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ నీలోఫర్, ఎంపిహెచ్ఎస్ లలితమ్మ, టిబిహెచ్‌వి సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE COURT AT ADONI
O.S 20/2022
Between:-
Bapuram Kranthi Kumar Reddy. ...Plaintiff
Versus
M. Sasank. ...Defendant
SUMMONS TO DEFENDANT
To
M. Sasank S/o M. Chenna Reddy,
H No: 1/1138-5,
Mulla Super Market Upstairs,
Yemmiganur Town - 518360
Whereas the above named plaintiff has filed the above suit against you for the recovery of due arrears of amount. You are hereby summoned to appear before this Court on 27/06/2023 at 10.30 A.M. either in person or through Advocate. If you fail to appear the case will be heard and decided ex-parte.
"BY ORDER OF THE COURT"
B. SURESH
ADVOCATE FOR PLAINTIFF
YEMMIGANUR

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT JUDGE AT KURNOOL
I.A. NO.318 OF 2021
IN
O.S. NO. 119 OF 2017
Between :
Smt. V. Suguna Devi
… Petitioner/Plaintiff
AND
1)Sri V. Ramesh and others
… Respondents/Defendants
To
Bellamkonda Ranga Swamy,
S/o. B. Ranganna Occ: Employee,
O/o. Union Bank of India previously Andhra Bank Regional Office: Gayathri Estate, Kurnool.
NOTICE
Please take Notice that my Client Smt. V. Suguna Devi, filed I.A. No. 318 of 2021 in O.S. No.119 of 2017 on the file of the I Addl. District Judge, Kurnool to implead you as a Defendant No.7 and this Hon'ble Court was pleased to Order Substitute Service by way of paper publication and posted the matter to 14.06.2023 for your appearance. You are therefore required to be present before the Court either in person or Counsel failing which the matter will proceed without any reference to you.
(BY ORDER OF THE HON'BLE COURT)
C.N. MOORTY
Advocate
Flat No.308, 3 rd Floor
Pushpanjali Complex,



ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల రుసుము చెల్లించండి : డిఇఒ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయుట కొరకు గడువు తేదీలోగా పరీక్షల ఫీజులు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం అనురాధ బుధవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ఫలితాలు ఏప్రిల్ విడుదల కాగా ఇంటర్మీడియట్‌లో జిల్లా వ్యాప్తంగా 31.89 శాతం, పదవ తరగతి పరీక్షలలో 18.81 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ రీకౌంటింగ్ ఏపీ ఆన్లైన్ ద్వారా ఈనెల 30 తేదీ లోపు ఫీజులు చెల్లించాలని అన్నారు. జూన్ 26 నుండి జూలై 4 వరకు అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. హాజరగు విద్యార్థులు ఈనెల 25 వరకు ఏపీ ఆన్లైన్ నందు చెల్లించవ చ్చును అని అన్నారు. మరిన్ని వివరముల కొరకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కళాశాలల ప్రిన్సిపాల్‌లను సంప్రదించవచ్చునని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం అనురాధ తెలిపారు.

అవుకు బస్టాండ్‌లో

వసతులు శూన్యం

- తలుపులు, లైట్లు లేని మరుగుదొడ్లు - అవస్థలు పడుతున్న మహిళలు, ప్రయాణికులు

ప్రజాశక్తి - అవుకు

అవుకులో ఉన్న బస్టాండ్

అవుకు పట్టణంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో వసతులు లేక ప్రయాణికులు, మహిళలు అవస్థలు పడుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎంతోమంది ప్రయాణికులు వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తూ ఉంటారు. అయితే అవుకు పట్టణంలో ఉన్న బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎటువంటి వసతులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. బస్టాండ్‌లో కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేవు. ఫ్యాన్లు లేవు. తాగునీరు కూడా లేదు. బస్సుల కోసం ప్రయాణికులు నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళల మరుగుదొడ్లకు ఉన్న డోర్లు లేక పోవటంతో ఒక మహిళ కాపలా ఉంటూ మరో మహిళ లోపలికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లకు లైట్లు లేకపోవడంతో సెల్‌ఫోను టార్చ్ ఆధారంగా మరుగుదొడ్లకు వెళ్ళవలసిన పరిస్థితి ఉంది. ప్రయాణికులకు తాగేందుకు మంచినీటి వసతి కూడా లేకపోవడంతో బస్టాండ్ ప్రాంతంలో ఉన్న కూల్ డ్రింక్ షాపుల్లో వాటర్ ప్యాకెట్లను కొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. బనగానపల్లె డిపో కేవలం అవుకు పట్టణానికి 18 కిలోమీటర్ల దూరం లో ఉన్నప్పటికీ కూడా ఆర్టిసి అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవుకు బస్టాండ్‌లో ఎటువంటి వసతులు ఏర్పాటు చేయకపోవడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని మహిళలు, ప్రయాణికులు కోరుతున్నారు.

28,486 మంది విద్యార్థులకు

జగనన్న విద్యా దీవెన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న విద్యా దీవెన జనవరి-మార్చి 2023 త్రైమాసికానికి సంబంధించి 28,486 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 23.91 కోట్లు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు బహిరంగ వేదిక నుంచి జగనన్న విద్యా దీవెన పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో 703 కోట్ల రూపాయలను కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి జమ చేసే వర్చువల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, సంక్షేమ శాఖ డిడి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు తదితరులు వీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద జనవరి - మార్చి 2023 త్రైమాసికానికి 28,486 మంది విద్యార్థులకు సంబంధించి 25,576 మంది తల్లుల ఖాతాల్లో రూ.23.91 కోట్లు జమ చేశామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు కలెక్టర్ హితబోధ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదు చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న డిపిఆర్ఓ, నంద్యాల వారి ద్వారా జారీలి లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, మార్క్ ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ తదితరుల చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు చెక్కును అందజేశారు.



లబ్ధిదారులకు జగనన్న విద్యా దీవెన చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్, తదితరులు

గురుకులాల్లో ఆణిముత్యాలు

- పది, ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు - ఉత్తీర్ణులు కాని వారికి ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆణిముత్యాలు తయారవుతున్నాయి. ఆ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు నమోదవుతున్నాయి. ఉత్తీర్ణులు కాని వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలనూ నిర్వహిస్తున్నారు...

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలుగా పేరు మారిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు విద్యలో ఆణిముత్యాలను తయారు చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో ఏడు పాఠశాలలు ఉండగా పదో తరగతి పరీక్షల్లో సరాసరిన 80.99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఆదోని గురుకుల పాఠశాలలో అత్యధికంగా 98.68 ఉత్తీర్ణత శాతం నమోదయింది. కంబాలపాడు పాఠశాలలో 86.84 శాతం, సి.బెలగల్‌లో 79.68, వెల్దుర్తిలో 77.50, పత్తికొండలో 77.33, అరికెరలో 75.67, దిన్నెదేవరపాడులో 71.05 ఉత్తీర్ణత శాతం నమోదైంది. నంద్యాల జిల్లాలో ఆరు పాఠశాలలు ఉండగా పదో తరగతి ఫలితాల్లో సరాసరిన 84.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా లక్ష్మాపురం గురుకుల పాఠశాల 96.20 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకుంది. ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి పాఠశాలలో 88.46, కోవెలకుంట్లలో 87.34, డోన్‌లో 81.57, జూపాడుబంగ్లాలో 77.77, ఆళ్లగడ్డ రెగ్యులర్‌లో 73.75 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం చిన్నటేకూరు, డోన్ పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో కర్నూలు జిల్లాలో ఐఐటి గురుకుల కళాశాల ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఆదోని కళాశాలలో బైపిసిలో 96.88 శాతం మంది, వెల్దుర్తి బైపిసిలో 94.29, చిన్నటేకూరు ఎంపిసిలో 93.62, చిన్నటేకూరు బైపిసిలో 92.16 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ కళాశాలలో బైపిసిలో 94.74, లక్ష్మాపురం బైపిసిలో 92.50, కోవెలకుంట్ల బైపిసిలో 91.43, కోవెలకుంట్ల ఎంపిసిలో 87.50 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ప్రత్యేక శిక్షణ శిబిరాలు..

పదో తరగతిలో ఉత్తీర్ణులు కాని వారి కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. చిన్నటేకూరు, డోన్ పాఠశాలల్లో ఈ శిబిరాలు నడుస్తున్నాం. విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావడమే మా లక్ష్యం. పాఠశాలలు, కళాశాలలో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాము.

- డాక్టర్ ఐ.శ్రీదేవి, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ జిల్లా కో ఆర్డినేటర్.

పదిలో ఉత్తమ మార్కులు సాధించిన వారు...

బి రాణి	డోన్	573
జి దేవిక	ఆదోని	568
కె సోని	ఆళ్లగడ్డ రెగ్యులర్	563
బి బాలగౌతమి	కోవెలకుంట్ల	562
ఎం శైలజ	దిన్నెదేవరపాడు	562
ఆర్ అనిత	దిన్నెదేవరపాడు	562
బి మౌనికబాయి	వెల్దుర్తి	549
సి ప్రియాంక	ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి	546
ఎం గుణప్రియ	ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పి	546

ఇంటర్మీడియట్‌లో ఇలా..

పి మనోజ్ కుమార్	కర్నూలు ఐఐటి	984
ఆర్ కిరణ్ కుమార్	కర్నూలు ఐఐటి	978
కె తేజ్ కుమార్	చిన్నటేకూరు	974
ఎం శ్యామల ఆదోని		973
బి పూజిత	పత్తికొండ	968
ఎం అర్చన	డోన్	967
పి సందీప్	చిన్నటేకూరు	960
యమున	ఆళ్లగడ్డ	959
ఎం మణి	కంబాలపాడు	958

మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు మండలంలోని పాత సిద్దేశ్వరం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మన్న (38) సంవత్సరాలు అనే మత్స్యకారుడు మంగళవారం సాయంత్రం సమయంలో చేపల వేట వెళ్లాడు. వలల నుంచి చేపలు తీస్తుండగా కృష్ణా నదిలో వలలు ఉండడం చేత తన పుట్టి తిరిగి బోల్తా పడుతుండడం గమనించిన అతను పుట్టి నుండి కృష్ణా నదిలో పడ్డాడు. నీటిలో చేపల కొరకు వేసిన వలలు ఉండడం చేత ఇరుక్కుని చనిపోవడం జరిగింది. బుధవారం చుట్టుపక్కల వారి సహాయంతో కృష్ణ నదిలో వలవేసి ఒడ్డుకు తీశారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య దాసరి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై తన భర్త కేవలం ప్రమాదవశాత్తు పుట్టి తిరిగి బోల్తా పడినందున కష్ణా నదిలో పడి చనిపోయినాడు అని తెలిపింది. ఈ విషయంపై స్థానిక ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అనాధలైన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని పలువురు మత్స్యకారులు, గ్రామస్తులు కోరారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి : ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని నంద్యాల ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసులు, అధ్యక్షుడు కాకర్ల శివ, ప్రధాన కార్యదర్శి జగన్ పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ హైదరాబాదులో ఎంపీ అవినాష్ రెడ్డికి సంబంధించి సిబిఐ విచారణ న్యూస్ కవరేజ్‌కి వెళ్ళిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి హెచ్ఎం టీవీల జర్నలి స్టులపై దాడి చేసి గాయపరచడం అప్రజా స్వామి కమని పేర్కొన్నారు. అదేవిధంగా ఆదివారం కర్నూ లు ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఎంపీ అవినాష్ రెడ్డి అను చరులు ఆంధ్రజ్యోతి ఈనాడు విలేకరులపై దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులు చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమా ండ్ చేశారు. ఉపాధ్యక్షుడు జాషువా, కమిటీ మెంబర్లు బాబు, రాజు, బాష, హరీష్, మధు పలువురు పాల్గొన్నారు.

ఎస్ పి కి వినతిపత్రం అందచేస్తున్న జర్నలిస్టులు

కాటసాని పుల్లమ్మ పాడిన మోస్తున్న ఎమ్మెల్యే లు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కాటసాని రామిరెడ్డిలు

ఎమ్మెల్యే కాటసానికి మాతృవియోగం

ప్రజాశక్తి - బనగానపల్లె

కాటసాని పుల్లమ్మ ఫైల్ ఫోటో

బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాతృమూర్తి కాటసాని పుల్లమ్మ (80) మృతి చెందారు. మంగళవారం రాత్రి కర్నూల్‌లోని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కాటసాని పుల్లమ్మ మృతి చెందారు. అవుకు మండలం గుండ్ల సింగవరం గ్రామంలో అస్రునయనాల మధ్య కాటసాని పుల్లమ్మ అంత్యక్రియలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైసీపీ నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, కాటసాని చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డిల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, కాటసాని కుటుంబాభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాటసాని పుల్లమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ నందు జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పథక సంచాలకులు, రామచంద్ర రెడ్డి మంగళవారం పరిశీలించి మస్టర్‌లను తనిఖీ చేశారు. ఉపాధి కూలీల రోజు వారి వేతనము రూ. 272 వచ్చేలా పనులను కల్పించాలని అధికారులకు సూచించారు. పండ్ల తోటల పథకం సంభందించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. బోల్లవరం గ్రామ చెరువును పరిశీలించి అమృత్ సరోవర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి పనులు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మనోహర్, ఇసి రామేశ్వరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎల్లయ్య, మహిళ మేటీలు సుధారాణి, హైమవతి, జయమ్మ, దర్గావతి, సులోచన పాల్గొన్నారు.

ఆరోపణల నిరూపణకు లోకేష్ సిద్ధమా..

- ఆళ్లగడ్డను అభివృద్ధి చేసింది గంగుల కుటుంబమే
- ఎమ్మెల్యే గంగుల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తనపై ఆరోపణలు చేశారని, ఆరోపణలు నిరూపణకు సిద్ధమా అని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల సవాలు విసిరారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ చేసిన వాక్యాలపై స్పందిస్తూ 2019 ఎన్నికల్లోఎమ్మెల్యే గెలిచిన నాటి నుండి 200 ఎకరాలు తాను సంపాదించానని నారా లోకేష్ తనపై ఆరోపణలు చేశారని ఆరోపణలు నిరూపణకు సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో పర్యటించిన నారా లోకేష్ స్థానిక శాసన సభ్యులపై ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం సబబు కాదన్నారు. లోకల్ నాయకులు ఏది రాసిస్తే అది చదవడం గొప్ప కాదని ఆ విషయంలో నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఇసుక, ఎర్రమట్టి, ఐటాక్స్, అక్రమ బియ్యం రవాణా చేస్తున్నారని ఆరోపణలు చేశారని వాటిపై నిజ నిర్ధారణకు సిద్ధమా అన్నారు. బి టాక్స్ అంటే ఆళ్లగడ్డలో అందరికీ తెలుసు అని అన్ని మీరే చెబుతూ మాపై బురద చల్లడం సబబు కాదన్నారు. భూమా కుటుంబం పై వైయస్ జగన్ ప్రభుత్వం కేసులు పెట్టలేదని నారా లోకేష్ తెలుసుకోవాలన్నారు. మీ కేసులతో లోకల్ ఎమ్మెల్యేలకు ఏమి సంబంధం అని నారా లోకేష్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో రహమాన్‌ను కొట్టి రూ.1.30 కోట్లు లాక్కునేది ఎవరో ఆళ్లగడ్డలో కోడై కూస్తుందని రహమాన్‌ను ఎందుకు విచారించలేదో నారా లోకేష్ సమాధానం చెప్పాల న్నారు. తల్లిదండ్రులు చనిపోయి తాను ఎమ్మెల్యే కాలేదని ప్రతిపక్షంలో ఉండి ప్రజలతో మమేకమై 2019 ఎన్నికల్లో ప్రజల చేత ఎమ్మెల్యేగా ఎన్నుకోబడ్డాను. ఆళ్లగడ్డ ప్రశాంతంగా ఉందని అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుందని నీవు వచ్చి పొడుస్తా అంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. నేను అనుకోనుంటే ఆళ్లగడ్డలో టిడిపి ఎప్పుడో ఖాళీ అయ్యేదన్నా రు. మా తాత గంగుల తిమ్మారెడ్డి కాలం నుండి మా పెద్దనాన్న గంగుల ప్రతాపరెడ్డి, నా వరకు ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. మంత్రిగా ఉండి మీరు ఏమీ అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. నేను ఎమ్మెల్యే అయ్యాక 50 పడగల ఆసుపత్రి, డిగ్రీ కాలేజ్ తెప్పించడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ ప్రజలకు అభివృద్ధి చేసింది ఎవరో తెలుసన్నారు. గడపగడపలో ప్రజలతో మమేకమై ప్రజలకు మేము చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరిస్తున్నామని 2024 ప్రజాతీర్పుకు సిద్ధంగా ఉన్నామని గంగుల నాని అన్నారు. అనంతరం విజయ డైయిరి చైర్మన్ ఎస్వి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర దేవర దున్నపోతు యాత్రగా ఉందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి,చిన్న వీరభద్రుడు, రాష్ట్ర వైసీపీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, , డాక్టర్ సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కూలూరు నరసింహారెడ్డి, సిరివెళ్ల అబ్దుల్ సలాం, భూమా చెంచిరెడ్డి, నాసారీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో జగద్గురు పీఠాధిపతి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయాన్ని శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్న సిద్ధ రామ శివాచార్య మహాస్వామి బుధవారం నాడు ఆలయాన్ని సందర్శించి స్వామి అమ్మవార్లను దర్శించు కున్నారు. పీఠాధిపతి తమ అనుచరులతో స్వామి అమ్మ వాళ్ళ దర్శించుకు నేందుకు ఆలయ రాజగోపురం వద్దకు చేరుకుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆ తర్వాత ముందుగా స్వామివారిని అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు అని ఆలయ అధికారులు తెలిపారు.

దర్శనం అనంతరం బయటకు వస్తున్న పీఠాధిపతి

రక్తనాళాల శస్త్ర చికిత్సలో ఆధునిక విధానాలు

ప్రజాశక్తి - నంద్యాల

రక్తనాళాల శస్త్ర చికిత్సలో ఆధునిక విధానాలు వచ్చాయని శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అజయ్ వైద్యవిద్య సదస్సులో పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జఫరుల్లా, డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ పనిల్‌ల నిర్వహణలో నంద్యాలలో స్థానిక సూరజ్ హోటల్ సమావేశ భవనంలో హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి సహకారంతో 'రక్తనాళాల శస్త్ర చికిత్సలో ఆధునిక విధానాలు' అంశంపై నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ప్రముఖ వ్యాస్కులార్ సర్జన్ డాక్టర్ అజయ్ ముఖ్య వక్తగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ అజయ్ మాట్లాడుతూ రక్తనాళాల లో వచ్చే జబ్బులకు షుగర్ వ్యాధి వలన పాదాలలోనీ రక్తనాళాలలో వచ్చిన మార్పుల వలన పాదం తొలగించాల్సిన ఆవశ్యకత ఏర్పడినప్పటికీ, రక్తనాళాల ఆధునిక శస్త్ర చికిత్స విధానాల ద్వారా పాదాన్ని కాపాడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రమాదాలలో రక్తనాళాలు తెగినప్పుడు కూడా సత్వర ఆధునిక విధానాల ద్వారా వాటిని సరిచేసి ఆయా అవయవా లకు తిరిగి రక్త ప్రసరణ జరిగే విధంగా చేయడానికి వాస్కులర్ సర్జరీలో అవకాశం ఉందని తెలిపారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యుల సమస్యలు ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రభుత్వ రాష్ట్రస్థాయి అధికారులతో నిరంతరం చర్చిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, కిమ్స్ ఆసుపత్రి ప్రాంతీయ సమన్వయకర్త శేఖర్, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్య సదస్సులో ప్రసంగిస్తున్న రక్తనాళాల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అజయ్

అధికారులు భూములు లాక్కుంటున్నారు

- డిఎఫ్ఓ కార్యాలయం ముందు చెంచు గిరిజనులు ధర్నా

ప్రజాశక్తి - ఆత్మకురు

ధర్నా చేస్తున్న గిరిజనులు

మండలంలోని చదరంపెంట చెంచుగూడెం, ఎర్రగుంట చెంచు గూడెంకు చెందిన చెంచుగిరిజనుల పంట పొలాలను అటవీ శాఖ అధికారులు బలవంతంగా ఆక్రమించుకుంటు న్నారని, ప్రభుత్వం కేటాయి ంచిన భూములను వారికే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నాడు ఆత్మకూరు పట్టణంలోని డిఎఫ్ఓ కార్యాలయం ముందు చెంచు గిరిజనులు మా పొలాలు మాకు ఇవ్వాలని కోరుతూ భూమిని పోతన్న భూమని లక్ష్మి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల ముందు చెంచు గిరిజనులకు జిల్లా కలెక్టర్, తహసీల్దార్, ఐ.టి.డి.ఏ పి.వో చేతుల మీదుగా చదరంపెంట చెంచు గూడెం,ఎర్రగుంట చెంచు గూడెం కు చెందిన చెంచు గిరిజనులకు ప్రభుత్వం ఐదు ఎకరాల ప్రకారం 40 కుటుంబాలకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. చెంచు గిరిజనులు ఆ పొలాలను 15 సంవత్సరాల నుంచి సాగుచేసుకుని పంటలు పండించి జీవనం సాగిస్తున్నారని, నేడు ఆ పొలాలను అటవీ శాఖ అధికారులు బలవంతంగా ఆక్రమించుకోవడం అన్యాయమని అన్నారు. వారి పొలాలను వారికే కేటాయించాలని, చెంచు గిరిజనుల అటవీ హక్కుల ను కాలరాయడం దారుణం అన్నారు. ఈకార్య క్రమంలో భూమని లక్ష్మి, భూమని పోతన్న,నిమ్మల ఈదమ్మ, భూమని ఏదన్నా ఉత్తలూరి లింగన్న, ఉత్తలూరి మహేశ్వరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ఆధార్ అప్డేషన్ పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ అప్డేషన్, మ్యాపింగ్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ సిడిపిఓలు, అంగన్ వాడి సూపర్వైజర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు ఆధార్ కార్డులు అప్డేషన్ చేయడంతో పాటు లేనివారికి ఇప్పించాలన్నారు. అలాగే పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పోషకాహార లోపం ఉన్న పిల్లలు వున్నారని రెండు వారాల్లో బరువు పెరిగేలా పోషకాహారాన్ని అందించాలన్నారు. అప్పటికి బరువు పెరగకపోతే ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కు చూపించి చికిత్సలు అందించాలని కలెక్టర్ సూచించారు. అత్యధిక పోషక లోపం ఉన్న పిల్లలను నేషనల్ రిహాబిలిటేషన్ కేంద్రాలకు తరలించాలన్నారు. గర్భిణీ స్త్రీలు అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రతిరోజు పోషకాహారం తినేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులు భర్తీకి అవసరమైన నోటిఫికేషన్లు జారీ చేసి భర్తీ చేసుకోవాలన్నారు.

అసంక్రమిత వ్యాధుల సర్వేను వేగంగా పూర్తి చేయండి

డయాబెటిస్, హైపటటీస్ తదితర అసంక్రమిత వ్యాధుల సర్వేను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. హైరిస్క్ కాన్పులు, సిజేరియన్ కాన్పులు ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటి హెల్త్ సెంటర్లలో తప్పకుండ నిర్వహించాలన్నారు.

వైసిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రామనారాయణరెడ్డి (45) అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందు తూ కోలుకోలేక బుధవారం మృతి చెందారు. రామ నారాయణ రెడ్డి మృతి పట్ల రాష్ట్ర వైసిపి మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, జడ్పిటిసి లక్ష్మీదేవి, ఎంపీపీ వీరభద్రుడు, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, వైసిపి నాయకులు పుల్లయ్య, టిఎన్ మహబూబ్ బాషా, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపిటీసీలు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈనెల 25న అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పర్యావరణ రక్షణ బాధ్యత అందరిది అని బండి ఆత్మకూర్ రేంజర్ నాసిర్జా, ఎఫ్ఎస్ఓలు వెంకటసుబ్బయ్య, రవీంద్ర నాయకులు తెలిపారు. బుధవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్రోగ్రాం కింద బండి ఆత్మకూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యావరణ రక్షణ మానవ జీవనశైలి వాతావరణ సమతుల్యం అడవుల రక్షణ తదితర అంశాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ బి ఓ లు వెంకటరమణ, మదర్ సాహెబ్, రామకృష్ణ, హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల బిల్లులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో గోకులం షెడ్లు నిర్మించి బిల్లులు మంజూరు కాక ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు త్వరగా బిల్లులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మేరీ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. గతంలో మండలంలో ఉన్న 12 గ్రామపంచాయతీలలో ఉన్న రైతులు 166 గోకులం షెడ్లు నిర్మించుకోవడం జరిగింది. వాటికి కొంతవరకు పలు దశల్లో బిల్లులు మంజూరయ్యాయి. చివరి దశ బిల్లులు మాత్రం మంజూరు కాలేదని వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి బిల్లును పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రక్రియ ఈనెల 31వ తేదీ లోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఏపీవో షేక్ రేష్మ, ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశువుల మృతిపై రైతులకు సూచనలు

ప్రజాశక్తి - అవుకు

మండలంలోని ఉప్పలపాడు, జూనుంతల, కొండమనాయన పల్లి, గ్రామాల్లోని పశువులు అనారోగ్యం బారినపడి చనిపోతున్నడంతో పశు వైద్య శాఖ ఏడి డాక్టర్ మారుతి సహకారం అవుకు పశు వైద్య డాక్టర్లు భారతీదేవి, తస్లీమ్ నజరీన్ రైతులకుపలు సూచనలను అందించారు. బుధవారం ఉప్పలపాడు గ్రామంలో వైసీపీ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పశువుల యజమానులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పశు వైద్య శాఖ ఏడి డాక్టర్ మారుతి సహకారం మాట్లాడుతూ ప్రతి వారంలో రెండు రోజులపాటు గ్రామాలకు కేటాయించి పశువులకు సంబంధించిన వ్యాధులను గుర్తించి వాటికి తగిన చికిత్సలు చేస్తామని తెలిపారు. రైతులు కూడా పశువులకు తగినంత ఆహారం నీరు అందించాలని పశువులకు ఏదైనా సమస్య ఉన్న ఎడల తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కొత్తగా పశువులకు అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారని రైతులు ఏదైనా సమస్య ఉన్నడాల 1962కు కాల్ చేయాలని తెలిపారు. ఉప్పలపాడు గ్రామ రైతులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పార్లపల్లి గ్రామం వద్ద ప్రభాస్ స్కూల్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మద్యం సేవించి నంద్యాల వైపు కాలినడకన వెళు తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తీవ్ర గాయాలు కావడంతో ప్రయాణికులు 108 వాహనం ద్వారా సమాచారం ఇచ్చి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతుండగా కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు ఎస్సై టి బాబు తెలిపారు. మద్యం సేవించిన వ్యక్తి మద్యం మత్తులో కాలినడకన నంద్యాల ఈ ప్రమాదం జరిగిందని, అతని ఆచూకీ తెలియడం లేదని, ఎవరైనా అతని బంధువులు సంబంధికులు ఉంటే బండి ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై బాబు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారదులు వాలంటీర్లు

- ఎమ్మెల్యే గంగుల నాని

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా ఉంటూ ప్రభుత్వం అంది ంచే సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ప్రముఖ పాత్ర వాలంటీర్లదేనని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల నాని అన్నారు. బుధవారం ఆళ్ళగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ వాలేంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవా మిత్ర అవార్డులతో ఎమ్మెల్యే గంగుల ఘనం గా సన్మానించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులనీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మీ సేవలు కొనియాడదగినవనీ మీరు ఇంకా మరింత చురుకుగా ఉండి మీ స్థానిక నాయకుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగాలని వాలంటీర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింహా ప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు,నల్లగట్ల విజయ కుమార్ రెడ్డి, కృష్ణా రెడ్డి, గంగుల నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని జై కిసాన్ పార్కు నందు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్ ఆధ్వర్యంలో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని 1,5,6, సచివాలయాల పరిధిలోని వాలంటీర్ల సేవలను గుర్తించి సేవా మిత్ర, సేవా వజ్ర అవార్డులను చైర్మన్, కమిషనర్ ఆధ్వర్యంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్‌లు లాలు ప్రసాద్ వాలంటీర్లకు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లాలు ప్రసాద్, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్,సచివాలయ కార్యదర్శిలు విజయ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

మాన్యం భూములకు వేలంపాటలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఆలమూరు గ్రామంలో వెలసిన చెన్నకేశవ, ఈశ్వర స్వామి దేవాలయ మాన్యం భూముల కౌలు వేలంపాటలు బుధవారం నిర్వహిం చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ రెండు దేవాల యాలకు సంబంధి ంచి 48, 11 ఎకరాల మాన్యము భూములు ఉన్నా యన్నారు. వీటికి సంబంధించి గత ఏడాది రూ5, 31, 500ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఏడాది మొత్తం రూ 9,21,500 వేలం పాట పాడగా గత ఏడాది కంటే ఈఏడాది రూ.3,90,000 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి తెలిపారు. ఈ వేలం పాటల్లో ఆలయ ధర్మకర్త శూలం ప్రభాకర్, వైసిపి నాయకులు పాణ్యం చంద్ర, పాణ్యం నాగేష్, పత్తి బ్రహ్మయ్య, పత్తి లక్ష్మీ నారాయణ, మాజీ సర్పంచ్ జయరాముడు, ఆలయ సిబ్బంది, రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు. వేలం పాటల సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఐ రాం భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రుద్రవరం: వేలంపాటలు నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మన్యం భూముల వేలంపాటలు బుధవారం నిర్వహించారు. ఈశ్వర స్వామి మన్యం, శ్రీఎల్లమ్మ దేవత మాన్యం, కేశవ రామచంద్ర ఆంజనేయస్వామి మన్యం మొత్తం 113.82 ఎకరాల భూమిని ఈవో వెంకటరమణ వేలం పాట నిర్వహించారు. గత సంవత్సరం రూ.15 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.23 లక్షల 66 వేల ఆదాయం వచ్చిందని దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేంపెంటలో..

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలన్నింటిని చూపించాలి : ఏపి టిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను అన్నింటిని చూపించాలనే ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రితో ఉపాధ్యాయ సంఘాలు జరిపిన చర్చల్లో ఉపాధ్యాయ బదిలీలలో ఖాళీలు అన్నిటిని చూపిస్తామని తెలియజేయడం జరిగిందని, ప్రమోషన్లు రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వడానికి అంగీకరించడం జరిగిందని తెలిపారు.. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఎవరైతే బదిలీలకు దరఖాస్తు చేసుకుంటారో, ఏవైతే లాంగ్ స్టాండ్ ఉంటాయో వాటిని మాత్రమే చూపిస్తాము అనడం సమంజసం కాదని ఖాళీలన్నిటిని కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఇచ్చే ప్రమోషన్ అన్నిటిని మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. ప్రమోషన్ల కొరకు విల్లింగ్ లేదా నాట్ విల్లింగ్ అడగడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రమోషన్ ఇచ్చే సమయంలోనే విల్లింగ్ లేదా నాట్ విల్లింగ్ తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ అసంబద్ధమైన నిర్ణయాలతో ఉపాధ్యాయుల లోకాన్ని గందరగోళం సృష్టిస్తుందని తెలిపారు. ఉపాధ్యా యుల ప్రమోషన్లు ఉత్తిత్తి ప్రమోషన్లు కాకుండా పర్మినెంట్ ప్రమోషన్ ఇవ్వాలని, ఉత్తుత్తి ప్రమోషన్లతో ఉపాధ్యాయులు నమ్మకం కోల్పోయారని, ఇక వెట్టి చాకిరి ప్రమోషన్లకు స్వస్తివలికి నిజమైన ప్రమోషన్లు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహా అధ్యక్షులు ఎం.మధుసూదన్ రావు, జిల్లా ఉపధ్యక్షుడు జి. లింగమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ వి. సుబ్బ రాయుడు, నాయకులు రమేష్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి : బిసి ఇందిర

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి, థాయ్ బాక్సింగ్ రాష్ట్ర చైర్మన్ బిసి ఇందిర పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి నివాసంలో వేసవి శిక్షణ శిబిరంలో ఉన్న విద్యార్థులకు క్రీడా దుస్తులను బిసి ఇందిర పంపిణీ చేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ నిర్వహించే వేసవి శిక్షణ శిబిరం శిక్షణ పొందుతున్న సెయింట్ జోసెఫ్ స్కూల్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, యోగ , కబడ్డీ, వాలీబాల్ క్రీడలలో శిక్షణ పొందుతున్న విద్యార్థు లకు బిసి ఇందిర ఉచితంగా క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాకా రులు, వ్యాయామ ఉపాధ్యాయులు బిసి ఇందిరను సన్మానించారు. ఈ సందర్భంగా బిసి ఇందిర మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరకదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. క్రీడలతో స్నేహం భావం పెరుగు తుందన్నారు. క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించి నియోజకవర్గానికి, తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రతిష్టలు తీసుకురా వాలన్నారు. బాలికలు ఆత్మ రచన కోసం బాక్సింగ్, కరాటే నేర్చుకోవాల న్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడా పరంగా, చదువు పరంగా ఏం అవసరం వచ్చినా నేను ఉంటానాని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, యోగ టీచర్ విద్యక, కోచులు హర్ష, చౌడయ్య, రామయ్య, రమేష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరా

మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు

కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సిసిఆర్సిపై సదస్సును బుధవారం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆత్మకూరు బి.ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయ మాట్లాడుతూ రైతులు, ఎవరైతే పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారో వారు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని తెలిపారు. సిసిఆర్సి కార్డు ఉంటేనే డాక్టర్ వైయస్సార్ రైతు భరోసా, పంట నమోదు, పంట బీమా, ఇన్ పుట్ సబ్సిడీ తదితర పథకాలు కౌలు రైతుకు వర్తిస్తాయని తెలిపారు. కావున కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కౌలుకు తీసుకున్న రైతు అందుకు సంబందించిన అగ్రిమెంట్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, భూయజమాని 1బి తదితర జిరాక్స్ కాపీలతో స్థానిక రైతు భరోసా కేంద్రం నందు సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమం నందు గ్రామ వ్యవసాయ సహాయకులు నరసింహ, వీఆర్వోలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దశాబ్దాలుగా రాయలసీమకు సాగునీటి వివక్ష

- 31 న జరిగే జలజాగరణ దీక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - నంద్యాల

దశాబ్దాలుగా రాయలసీమ ప్రాంతం సాగునీటి విషయంలో వివక్షతను ఎదుర్కొంటోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యస్.రెడ్డి అన్నారు. ఈనెల 31న జరుగనున్న సిద్దేశ్వర జలజాగరణ దీక్షను పురస్కరించుకొని బుధవారం నాడు నంద్యాల మండలంలోని అయ్యలూరు, చాబోలు, మిట్నాల, పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాలలో ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని చేపడితే రాయలసీమలో కరువును నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు. కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారిలో భాగంగా కృష్ణా నదిపై కేంద్ర ప్రభుత్వం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతోందని, ఐకానిక్ బ్రిడ్జి బదులు అలుగుతో కూడిన బ్రిడ్జిని నిర్మిస్తే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని ఆయన పేర్కొన్నారు. సిద్దేశ్వర అలుగు శంఖుస్థాపన ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31న జరిగే సిద్దేశ్వర జలజాగరణ దీక్షను విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సిద్దేశ్వర జలజాగరణ దీక్ష గోడపత్రికలను ప్రజలతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమాలలో భాస్కర్ రెడ్డి, మనోజ్ కుమార్ రెడ్డి, గ్రామ పెద్దలు అప్పిరెడ్డి, చిన్న తిరుపతి రెడ్డి, త్రిలేంగశ్వరరెడ్డి, తులశీశ్వరరెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రోడ్డుపైనే మురుగు

- పట్టించుకోని అధికారులు- అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఖాజీవాడలో ఒక వీధిలో మురుగునీరు సిమెంట్ రోడ్డుపై నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఖాజీవాడలోని ముస్లిం స్మశాన వాటిక సమీపంలో వీధిలో మురుగునీరు వీధిలో నిలిచి పోయాయి. దీంతో ప్రజలు రోడ్డుపై నడవలేని దుస్థితి ఏర్పడింది. దుర్వాసన భరించలేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో లక్షలాది రూపాయలతో ఖాజీవాడలో డ్రైనేజీ పనులు చేశారు. స్మశాన వాటిక పక్కన డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేసిన కాలనీ వాసులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. డ్రైనేజీ కాలువ వేయకముందు వీధిలో నీళ్లు నిలిచేవి కాదని డ్రైనేజీ కాలువ వేసిన తర్వాత వీధిలో నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుం డడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుకున్నట్లు తెలిపారు. మోకాళ్ళ లోతు నీరు వీధిలో నిలిచి ఉండడంతో ప్రజలు వీధిలో తిరగలేని దుస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ అధికారులు మురికి నీరు నిలిచిన పట్టించుకో కపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగు నీరు వీధిలో నిలిచి దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళల మరుగుదొడ్డిలోనికి వెళ్లేందుకు లేక ఆ కాలనీ మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్డి ముందర మోకాళ్ళ లోతు నీరు నిలవడంతో మహిళలు మరుగుదొడ్లకు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఇలా ఉంటే రోగాలు రావాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వేసవికాలంలోనే వీధిలో ఇలా నీరు నిలిస్తే వర్షాకాలంలో తమ పరిస్థితి ఏమిటని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. డ్రైనేజీ కాలువ ఎత్తు లేపడం వల్ల డ్రైనేజీ కాలువ నీళ్లు మెయిన్ డ్రైనేజీలోకి కలవడానికి లేక వీధుల్లో మురుగునీరు నిలుస్తున్నాయని అధికారులు సిమెంట్ రోడ్డును ఎత్తు లేపి తమను ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సిసి రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ఆళ్లగడ్డ పట్టణ సిఐగా రమేష్ బాబు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణ సీఐగా రమేష్ బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, సిబ్బంది సిఐ రమేష్ బాబుకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఆళ్లగడ్డ డిఎస్పి వెంకటరామయ్య ఆదేశాల మేరకు తాను ఆళ్లగడ్డలో పట్టణ సిఐగా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలకు తాము ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉంటూ ప్రజల్లో మమేకమవుతున్నారు. టౌన్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ పైన కూడా దృష్టి సారిస్తామన్నారు, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తామని సిఐ తెలిపారు.

లేగదూడల సంరక్షణకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - రుద్రవరం

లేగదూడల సంరక్షణ కోసం రైతులకు ప్రోత్సహాలు ఇస్తామని నంద్యాల విజయ పాల డెయిరి చైర్మన్ ఎస్‌వి జగన్మోహన్ రెడ్డి అన్నారు. మండ లంలోని మాచినేనిపల్లి, చందలూరు గ్రామాల్లో బుధవారం కృత్రిమ గర్భధారణ వలన జన్మించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారి మనోరంజన ప్రతాప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల విజయ పాల డెయిరి చైర్మన్ ఎస్‌వి జగన్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధి కోసం విజయ పాల డెయిరి ఆధ్వర్యంలో ప్రతి లీటరు పాలకు బోనస్ రెండు రూపాయల ప్రకారము ప్రతి ఏడాది అందజేస్తున్నామన్నారు. రైతులు లేగదూడల సంరక్షణ కోసం వారిని ప్రోత్సహించేందుకు బహుమతులు కాల్షియం, ఎముకల పొడి ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. వీటికి చెల్లించాల్సిన రూ. 500 నగదును డెయిరి ద్వారానే ఇవ్వడం జరిగిందన్నారు. లేక దూడల సంరక్షణ తదితర అంశాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎల్‌డిఏ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మల్లన్న, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, విజయ పాల డెయిరి డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, డాక్టర్ జయ సూర్య, రుద్రవరం విజయ పాల డెయిరి మేనేజర్ శివ శంకర్ రెడ్డి, గోపాలమిత్ర సభ్యులు సంజన్న, రాజు, ఆయా గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని గొడుగునూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటు కొని గడ్డివామి దగ్ధమైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇండ్ల ప్రసాద్ గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. స్థానికులు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 50వేల రూపాయల దాకా నష్టం వాటిల్లిందని , ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

బండి ఆత్మకూర్ : మండలంలోని కౌలు రైతు సోదరులు కౌలు కార్డు పొందుటకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి స్వాతి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతు కార్డుల కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని కౌలు కార్డు పొందగోరే రైతన్నలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారు.

చౌడేశ్వరి దేవికి పూజలు నిర్వహిస్తున్న బీసీ జనార్దన్ రెడ్డి

ఘనంగా చౌడేశ్వరి దేవి మహోత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో చౌడేశ్వరి దేవి మహోత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి మహోత్సవాలలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి వచ్చిన బీసీ జనార్దన్ రెడ్డికి మాజీ సర్పంచ్ లు రామిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, టిడిపి నాయకులు బాలుడుల ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీసీ జనార్దన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

విస్తృతంగా ఓటర్ వెరిఫికేషన్

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని గుటుపల్లి, రహిమాన్ పురం, హుస్సేనాపురం, కొత్తపల్లె, అంబాపురం, గ్రామపంచాయతీలలో బేతంచర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య నాగయ్య ఆయా గ్రామాలలో ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలని బూత్ కన్వీనర్లకు ఆదేశించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామాలలో ఉన్న టిడిపి నాయకులు ఎప్పటికప్పుడు ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ చేసుకుని కొత్త ఓటర్ల నమోదు చేయించుకునే విధంగా తీసివేసిన ఓటర్లను మళ్లీ నమోదు చేయించుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, మైనారిటీ ముస్లిం నాయకులు ముల్లా, రామ్ తిమ్మారెడ్డి, వెంకటరాముడు, రహిమాన్ పురం వెంకటేశ్వర గౌడ్, వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు బుక్కాపురం లక్ష్మన్న, కొత్తపల్లి మహేశ్వర్ రెడ్డి, అంబాపురం చంద్ర, సూర్య చంద్రారెడ్డి, మధుసూదన్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి లొడ్డశేఖర్, వారాల మద్దిలేటి స్వామి, నల్లాడ్డి, గుడిసె మద్దిలేటి, చెన్నయ్య పాల్గొన్నారు.